క్లుప్తంగా

ఓట్ల తొలగింపుపై క్షేత్ర పరిశీలన



ఓటర్లతో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ ఎంవీ సుధాకర్

సంగం: సంగంలోని సచివాలయం-3 పరిధిలో ఓట్ల తొలగింపుపై బుధవారం స్పెషల్ ఆఫీసర్ ఎంవీ సుధాకర్ ఓటర్ల జాబితాను పరిశీలించి తొలగించిన ఓట్లపై గ్రామంలో ఫీల్డ్ విజిట్ చేశారు. తొలగించిన ఓటర్ల ఇళ్ల వద్దకు స్వయంగా వెళ్లి తనిఖీ చేశారు. ఓటు తొలగింపుపై ఓటరుకు క్షుణ్ణంగా ఎందుకు తొలగించారో వివరించి వారి అంగీకారం తీసుకున్నారు.

జెడ్పీ హైస్కూల్లో తనిఖీలు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు నాగరాజు

సంగం: సంగం జెడ్పీ హైస్కూల్‌ను బుధవారం తహసీల్దారు నాగరాజు సందర్శించారు. పాఠశాల పోలింగ్ కేంద్రంగా ఉండడంతో పరిశీలించారు. అనంతరం తరగతి గదులను, డిజిటల్ క్లాస్‌రూంలు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యాబోధన సక్రమంగా జరుగుతుందా లేదా అని విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న మెడికల్ క్యాంపును పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మెడిసిన్, ఇంజినీరింగ్‌లో సీట్లు



మెడిసిన్, ఇంజినీరింగ్ సీట్లు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న గ్రామస్తులు, ఉపాధ్యాయులు

చేజర్ల: మండలంలోని బిల్లుపాడు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుంచి 7వ తరగతి వరకు చదివిన విద్యార్థులు మెడిసిన్, ఇంజినీరింగ్ వంటి ఉన్నత చదువుల్లో సీట్లు సాధించిన విద్యార్థులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు. ఆ గ్రామ చరిత్రలో మొదటి సారిగా మెడిసిన్ సీటు సాధించిన ఐతా అశోక్‌తో పాటు ఇంజినీరింగ్‌లో సీట్లు సాధించిన గొర్ల చక్రవర్తి, మహేశ్‌ను సన్మానించి అభినందించారు. వారికి 1 నుంచి 7వ తరగతి వరకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయుడు ఎం.రవిబాబును సన్మానించారు.


బిల్లుపాడు పాఠశాలకు కంప్యూటర్ వితరణ



స్కూల్‌కు కంప్యూటర్ బహూకరించిన దాతలు

చేజర్ల: మండలంలోని బిల్లుపాడు ప్రాథమికోన్నత పాఠశాలకు కంప్యూటర్, సామగ్రిని బుధవారం బహూకరించారు. కలువాయి మండలం చింతల్మాకూరుకు చెందిన దామినేని శ్రీనివాస చౌదరి కేరళలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తూ గత నెలలో జరిగిన ప్రమాదంలో మరణించారు. ఆగస్టు 30వ తేదీన ఆయన జ్ఞాపకార్థం అతని తల్లి సులోచనమ్మ, తాత రమణయ్య బిల్లుపాడు ప్రాథమికోన్నత పాఠశాలకు అవసరమైన కంప్యూటర్, ప్రింటర్, మానిటర్, కీబోర్డులు బహూకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివకుమారి, పెంచలనాయుడు, ప్రధానోపాధ్యాయులు బి వెంకటరమణమ్మ, ఉపాధ్యాయులు ఏ సుబ్బయ్య, డి రాజ్‌కుమార్, పి నరహరి, డి.శాంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశం



గణిత ఉపాధ్యాయుల సమావేశం

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలం రేవూరు, అనంతసాగరం ఉన్నత పాఠశాలల్లో బుధవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. అనంతసాగరం, మర్రిపాడు, ఆత్మకూరు గణిత ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల ఎంఈఓ-2 కే ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠ్యాంశం, గణిత బోధనలపై తీసుకోవాల్సిన మెళకువలు వివరించారు. ఎఫ్ఏ-1 పరీక్షలపై విశ్లేషణ, మూల్యాంకణ పద్ధతులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అనంతసాగరం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం లక్ష్మీ ప్రసన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచ్చిరాని చిలుక జోస్యం

నెట్టింట జాతకాలు

- యూట్యూబ్‌లో వెల్లువెత్తున్న విశ్లేషణలు
- రోజు, వారం, నెల, వార్షిక ఫలితాలపై డిబేట్లు
- బతుకుదెరువు కోల్పోయిన చిలుక జ్యోతిష్యులు

కావలి/బిట్రగుంట: జాతకం.. అంటే ఎంతో ప్రాశస్త్యమైంది. చంద్రమానం, సూర్యమానం ప్రకారం జ్యోతిష్యాన్ని మదించిన పండితులు గ్రహ గమనాలు, జన్మనక్షత్రాలు, తదితర అంశాలను పరిగణలోకి జాతకాలు చెప్పేవారు. ఇటువంటి వారు చాలా అరుదుగా ఉంటారు. అయితే ప్రజల్లో ఉన్న విశ్వాసాలను తమ బతుకుదెరువు కోసం కొందరు చిలుక జ్యోస్యాలు, సోదిలు చెప్పుకుంటున్నారు. అయితే కాలం మారింది. నెట్టింట జ్యోతిష్యం వచ్చేస్తుండడంతో తన జాతకం బాగలేక చేతిలో చిలుకను పట్టుకుని బతుకుదెరువు కోసం అందరికీ జాతకాలు చెప్పే వారి తలరాతలు తలకిందులయ్యాయి. నాగదోషం, పితృదోషం.. ఇలా ఏదోకటి చెప్పి.. ఉగాది తర్వాత.. దసరా తర్వాత అన్ని మారిపోతాయంటూ ఊరట మాట చెప్పి సంతృప్తి పరిచి నాలుగు రూపాయలు సంపాదించుకునేవారు. గతంలో బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, సినిమా హాళ్లు, పార్కుల ఎదుట, గుళ్లు, గోపురాల సమీపంలో చిలుక జోస్యం చెప్పే వాళ్లు. శుభ్రంగా తలస్నానం చేసి, నుదుటిన ఆకర్షణీయమైన తిలకంతో పాడవాటి బొట్టు పెట్టుకుని, తెల్లని పంచెలు ధరించి చిలుక జోస్యం పెట్టెలతో అందరినీ ఆకట్టుకునే వారు. తమ మాటల గారడీతో, రామచిలుకలు చూపించే భవిష్యవాణి కార్డులతో జ్యోతిష్యాన్ని నర్మగర్భంగా, నమ్మకంగా వివరించేవారు. నిరాశలో ఉన్న మనిషికి వీరి మాటలే పెద్ద ఓదార్పుగా ఉండేవి. డిగ్రీలు చదవకపోయినా, మనిషిని చదవడంలో వీరి నేర్పరితనం చాకచక్యంగా ఉండేది. పదో, పాతికో తీసుకుని భవిష్యత్ బ్రహ్మాండంగా ఉంటుందనే నమ్మకం కలిగించే వారు. నిరుద్యోగులు, కాయాకష్టం చేసుకునే వారు ఎక్కువగా చిలక జోస్యంపైనే ఆధారపడే వారు. అయితే ప్రస్తుతం ఆన్‌లైన్ మహత్యంతో చిలుక జోస్యం చెప్పేవారి జాతకాలే తారుమారుగా తయారయ్యాయి. గతంలో మానసిక స్వాంతన కలిగించిన చిలుకమ్మ జోస్యం ఇప్పుడు హాస్యంగా మారిపోయింది. చిలుక జోస్యం చెప్పేవాళ్లను కామెడీగా చూస్తుండటంతో అరుదైన ఈ కళ అంతరించే పరిస్థితి నెలకొంది.



వృద్ధురాలికి సీరియస్‌గా జాతకం చెబుతున్న దృశ్యాలు

అంతా ప్రత్యేకమే

జ్యోతిష్యం, జాతకం అనేవి భారతీయ సంస్కృతిలో ప్రత్యేకమైన విభాగాలు. గ్రహ గమనాలు, జన్మనక్షత్రాలు, తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని మనిషి భవిష్యత్‌ను రేఖామాత్రంగా అంచనావేసే జ్యోతిష్య శాస్త్రంలో చిలుక జోస్యం మాత్రం చాలా విభిన్నంగా ఉంటుంది. ఒక పక్షి ద్వారా మనిషి భవిష్యత్‌ను ఊహించి చెప్పడంలో చిలుక జోస్యం చెప్పేవాళ్లది అందె వేసిన చెయ్యి. చిన్నప్పటి నుంచి శిక్షణ పొందిన రామచిలుకలు, యజమాని చేతి సంజ్ఞలను అర్థం చేసుకుని అనువైన కార్డులు బయటకు తీస్తాయి. వీటి ఆధారంగా మనిషి జాతకం చెప్పి పొట్టపోసుకునే వారు. కావలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద, రైల్వే స్టేషన్ వద్ద, సినిమాహాళ్ల వద్ద పదుల సంఖ్యలో కనిపించే చిలుక జోస్యం చెప్పేవాళ్లు ప్రస్తుతం ఒకరిద్దరు కూడా కనిపించడం లేదు. గతంలో రోజుకు వెయ్యి వరకూ సంపాదిస్తుండగా ప్రస్తుతం రూ.150 రూపాయలు కూడా రావడం లేదని వాపోతున్నారు.

> • ఇతని పేరు మునిశంకర్. ఇతని కుటుంబం తరతరాలుగా చిలుక జాతకాలు చెప్పే వృత్తి. ఇతను కూడా చిలుకతో జాతకాలు చెప్పే వృత్తినే కొనసాగిస్తున్నాడు. చిలుక జాతకాలు చెప్పడానికి రోడ్డుపై కూర్చొంటే రోజుకు కనీసం 10 మంది కూడా జాతకాలు చెప్పించుకోవడానికి రావడం లేదు. జాతకం చెప్పమని కేవలం రూ.10 మాత్రమే ఇస్తారు. టీ కూడా రాదంటే మరో రూ.10 లు ఇస్తారు. ఇలా రోజుకు రూ.100 నుంచి రూ.200 మాత్రమే వస్తోంది. దీంతో ముగ్గురు పిల్లలతో ఉన్న ఇతని కుటుంబం జరుగుబాటుకు అవస్థలు పడుతున్నాడు. అందుకే బేల్దారీ కూలి పనులకు భార్యతో కలిసి వెళ్తుంటాడు. కూలి పనులు దొరకని రోజు చిలుక జాతకం చెప్పడానికి రోడ్డుపై కూర్చొంటాడు. కావలి పట్టణంలో మునిశంకర్ లాంటి చిలుక జాతకం చెప్పే వృత్తి జీవనాధారంగా చేసుకొని బతికే కుటుంబాలు 300 మంది ఉండేవారు. ఇప్పుడు పట్టుమని పది మంది కూడా లేరు.



ఆన్‌లైన్ జాతకాలతోనే దెబ్బ

ఆరేడేళ్ల వరకు కూడా చిలుకజోస్యం చెప్పేవాళ్ల జాతకాలు మూడు పువ్వులు, ఆరుకాయలుగా ఉండేవి. ఉదయం పది గంటల నుంచే జాతకం చెప్పించుకునే వాళ్ల హడావుడి కనిపించేంది. చిలుకజోస్యం చెప్పేవాళ్లు గ్రామాలకు వెళితే భోజనం, బట్టలు పెట్టడంతో పాటు కాయకూరలు, కోడిపెట్టలు కూడా ఇచ్చి పంపించేవారు. అయితే ఆన్‌లైన్ జాతకాలు వచ్చిన తరువాత వీరి పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఆన్‌లైన్‌లో, యాప్‌ల్లో ఉచితంగా జాతకాలు చెబుతుండటంతో చిలుక జోస్యం చెప్పించుకునే వాళ్లు కరువయ్యారు. దీంతో వీరికి ఉపాధి కరువైంది.



జాతకాలు చెప్పించుకునే వారి కోసం ఎదురు చూస్తున్న దృశ్యం

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కొండాపురం: మండలంలోని ఇస్కదామెర్ల పంచాయతీలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి చిమిలి రవీంద్ర బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి పొట్టిపల్లి, కేవీఆర్‌కాలనీల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని తెలిపారు.

పశువైద్య శిబిరం

అనుమసముద్రంపేట: మండలంలోని కొండమీదకొండూరు సచివాలయంలో బుధవారం పశువైద్యాధికారి డాక్టర్ అన్సారీ ఆధ్వర్యంలో పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు. గేదెలకు చూడి పరీక్షలు, దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. అనంతరం పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ శేషారెడ్డి, మసూద్, శ్రీకాంత్, యస్దాని, ఆల్విన్ తదితరులు పాల్గొన్నారు.

స్థలాల ఆక్రమణపై విచారణ

చేజర్ల: మండలంలోని నాగులవెలటూరు పంచాయతీకి సంబంధించిన గ్రామకంఠం స్థలాలను ఓ నాయకుడు ఆక్రమణపై గ్రామస్తులు ఇటీవల జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం విచారణ చేపట్టారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డీఎల్‌పీఓ శ్రీనివాసరావు ఆక్రమిత స్థలాలను పరిశీలించారు. గ్రామస్తులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఈ మేరకు నివేదిక తయారు చేసి జిల్లా అధికారులకు అందజేస్తామని తెలిపారు.

ఏఎస్‌పేటలో త్వరలో సహకార బ్యాంక్

అనుమసముద్రంపేట: ప్రముఖ యాత్ర స్థలం ఏఎస్‌పేటలో సెప్టెంబర్‌లో సహకారం బ్యాంక్ బ్రాంచ్ ఏర్పాటు చేయనున్నట్లు నెల్లూరు సెంట్రల్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శంకర్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన ఏఎస్‌పేట బ్రాంచ్‌లో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. లాకరు గది, స్ట్రాంగ్‌రూం, మేనేజర్ రూంలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరు సెంట్రల్ బ్యాంక్ పరిధిలో ఇటీవల మంజూరైన బ్రాంచ్‌లోలమొదట ఏఎస్‌పేట బ్రాంచ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. బ్యాంక్‌లో పనులు పూర్తి కావచ్చాయని, సెప్టెంబర్‌లో ప్రారంభిస్తామన్నారు. తక్కువ అద్దెతో లాకర్ సౌకర్యం కల్పిస్తామన్నారు. నూతన బ్రాంచ్ మేనేజర్‌గా అపాయింట్ అయిన సుబ్బారెడ్డి మాట్లాడుతూ బ్రాంచ్ పరిధిలోని గ్రామాల్లో రైతులకు ప్రజలకు తమ బ్రాంచ్ సేవలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ రైతులకు విరివిగా పంట రుణాలు అందజేస్తామన్నారు. రైతులు తమ బ్యాంకులో అకౌంట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజవోలు సొసైటీ అధ్యక్షుడు కల్లూరు ప్రభాకర్‌రెడ్డి, సొసైటీ కార్యదర్శి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



బ్రాంచ్‌లో జరుగుతున్న చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శంకర్‌బాబు

క్రీడల్లో ప్రతిభ చూపాలి

- మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్
- విద్యార్థులకు క్రీడాదుస్తుల అందజేత

ఆత్మకూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపి ప్రతిభతో క్రీడా కోటాలో ఉద్యోగాలు సాధించాలని ఆత్మకూరు మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు 25 జతల క్రీడా దుస్తులను ఆయన సొంత నిధులతో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ గౌరవ సూచకంగా ఏటా ఆయన పుట్టిన రోజును క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. మూడు ఒలంపిక్ పతకాలు సాధించిన ధ్యాన్‌చంద్‌ను దేశంలోని ప్రతి క్రీడాకారుడు స్ఫూర్తిగా తీసుకుని స్వయంశక్తితో ఎదగాలన్నారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి క్రీడల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నారని, ఆయన స్ఫూర్తితో తాను సైతం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సర్దార్, హెచ్ఎం కోటేశ్వరి, సయ్యద్ జమీర్ బాషా, కౌన్సిలర్లు చిన్నపరెడ్డి, ప్రసాద్, ముజిబుల్లా, మల్లిక ఇందిరమ్మ, జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న దృశ్యం

రక్షాబంధన్ వేడుకలు



భవిత కేంద్రంలో 'సక్షం' సంస్థ రక్షాబంధన్ వేడుకలు



ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌కు చిత్రపటం అందజేస్తున్న బ్రహ్మకుమారి

కావలి: శారీరిక, మానసిక దివ్యాంగుల భవితకు భరోసా కల్పిస్తామని, అండగా నిలుస్తామని సంకల్పిస్తూ రాఖీలు కట్టాలని ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక తుమ్మలపెంట రోడ్డులోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో 'సక్షం' సంస్థ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. రూ.5,000 విలువైన ఆట వస్తువులు కేంద్రానికి బహుకరించడంతో పాటు, కేంద్రంలో శిక్షణ పొందుతున్న బాలలకు రక్షలు కట్టి, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 'సక్షం' జిల్లా ప్రధాన కార్యదర్శి రంగయ్య, కావలి శాఖ బాధ్యులు మంగళగిరి వేణుగోపాల్ రావు, నాగమణి రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దినేష్, మోహన్ రెడ్డి, రొటేరియన్లు గోపికృష్ణ, సలీం బేగ్, సదరం ఉద్యోగి భాస్కర్‌రావు, 'సక్షం' అల్లూరు మండల కన్వీనర్ రమణయ్య, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ

ఆత్మకూరు: అన్నాచెల్లెళ్ల అనురాగానికి ఆత్మీయతకు, అనురాగానికి ప్రతీకగా రాఖీ పండగ నిర్వహించుకుంటున్నట్లు సోదరి బ్రహ్మకుమారి అన్నారు. రాఖీ పండగను పురస్కరించుకుని సాయంత్రం పలువరు బ్రహ్మకుమారిలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారులకు రాఖీలు కట్టి బ్రహ్మకుమారిల చిత్రపటాలను అందజేశారు. అన్నాచెల్లెళ్ల మధ్య అనుబంధం పెరగడంతో పాటు సృహద్భావ వాతావరణం పెరిగి ప్రపంచ శాంతి ఏర్పడుతుందని బ్రహ్మకుమారిలు పేర్కొన్నారు.

జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని

వరికుంటపాడు: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పించాలని ఎంపీడీఓ చేవూరి శ్రీదేవి సూచించారు. ఆమె బుధవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పని ప్రదేశాలు, కూలీల సంఖ్య పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల గ్రూపుల్లోని కూలీలకు వంద రోజుల పనిదినాలు కల్పించి పూర్తయ్యేలా చూడాలన్నారు. గ్రామాలకు ఉపయోగపడే పనులు ఎంపిక చేసి చేపట్టాలన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీదేవి

నేడు వలంటీర్లతో సమావేశం

కలిగిరి: కలిగిరిలోని ఆవుల రమణారెడ్డి కల్యాణ మండపంలో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ వలంటీర్లతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 14 సచివాలయాల పరిధిలోని అందరూ వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

మాదకద్రవ్యాలతో దుష్పరిణామాలు

ఆత్మకూరు: మాదక ద్రవ్యాల వినియోగంతో తీవ్ర అనర్థాలు తప్పవని, ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు ఆర్థికంగా నష్టపోవడం, సమాజంలో విలువలేని వ్యక్తిగా ఉండాల్సి వస్తుందని ఆత్మకూరు సెబ్ సీఐ బీ నయనతార అన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, వాటి పరిణామాలపై ఆత్మకూరులోని ఎల్ఆర్‌పల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. నయనతార మాట్లాడుతూ తొలుత సరదాగా అలవాటు అయ్యే మాదక ద్రవ్యాల వినియోగం క్రమేపి వ్యసనంలా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ సిబ్బంది, పాఠశాల హెచ్‌యం, ఉపాధ్యాయులు ఉన్నారు.

విద్యుత్ హైటెన్షన్ లైన్లను తొలగించాలని వినతి

చేజర్ల(సోమశిల): అనంతసాగరంలో ప్రభుత్వం ఇచ్చిన జగనన్న లేఅవుట్ల ఇళ్ల స్థలాల మధ్యలో సోమశిల పవర్‌స్టేషన్ నుంచి అనంతసాగరం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వచ్చే విద్యుత్ హైటెన్షన్ లైన్లు ఉండడంతో ఇళ్ల నిర్మాణాలకు అటంకం ఏర్పడిందని సీపీఎం అనంతసాగరం కార్యదర్శి అన్వర్‌బాషా అన్నారు. బుధవారం ఎంపీడీఓ మధుసూదన రావుకు ఆయన వినతిపత్రం అందజేశారు. దీంతో చాలా మంది ఇల్లు మట్టాలు వరకు నిర్మించుకుని శ్లాబు వేయడానికి తీగలు అడ్డుగా ఉన్నాయన్నారు. విద్యుత్ అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రఫి, మహిళలు పాల్గొన్నారు.

గ్యాస్ ధర తగ్గింపు ఎన్నికల స్టంటే

ఆత్మకూరు: ఇప్పటి వరకు సామాన్యుడికి అందని స్థాయిలో గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతున్న కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా రూ.200 ధర తగ్గించడం ఎన్నికల స్టంటేనని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వన్నెం నాగరాజు అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నాగరాజు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికలు స్టంట్‌గా కేంద్రం సిలిండర్ ధర తగ్గించిందంటూ ఆయన వ్యాఖ్యానించారు. గతంలోనూ గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను ఎన్నికల సమయంలోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తగ్గించిందన్నారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధురాలి మృతి

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం బీసీ కాలనీకి చెందిన షేక్ మీరమ్మ (75) సోమవారం రాత్రి విద్యుత్ షాక్ గురై మృతి చెందింది. వర్షం పడుతుండడంతో ఆరుబయట ఉన్న విద్యుత్ మోటార్‌పై రేకు పెట్టే క్రమంలో విద్యుదాఘాతానికి గురైంది. దీంతో కుటుంబ సభ్యులు గుర్తించి గండిపాళెం పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే ఈ మేరకు పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

ఆలయాల అభివృద్ధికి చర్యలు

- పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు

కలిగిరి: రాష్ట్రంలో ఆలయాలల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి తెలిపారు. వీరారెడ్డిపాళెంలో టీటీడీ (శ్రీవాణి ట్రస్ట్) సహకారంతో నిర్మించిన శ్రీమాతా పరమేశ్వరిదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. చిరంజీవిరెడ్డి మాట్లాడుతూ సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీటీడీ సహకారంతో గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో విస్తృతంగా ఆలయాలల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆర్‌వీ కళాధర్‌రావు, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లూరి విష్ణు, మండల కన్వీనర్ కేవీ రంగారావు, ధర్మప్రచారక్ కర్రా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా నిర్మించిన మాతాపరమేశ్వరిదేవి ఆలయం

హోరాహోరీగా ఆటల పోటీలు

కావలి: విశ్వోదయ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి (డీఆర్) పేరు మీద విశ్వోదయ డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో జరుగుతున్న డాక్టర్ డీఆర్ బాలల దినోత్సవం- 2023 క్రీడాపోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. బుధవారం వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నీస్ ఆటల్లో విద్యార్థులు ఆద్యంతం ఉత్కంఠంగా సాగిస్తున్నారు. కావలి నియోజకవర్గంలోని కావలి రూరల్, బోగోలు, అల్లూరు, దగదర్తి మండలాలతో పాటు కావలిటౌన్ నుంచి 50 పాఠశాలల విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. అయితే మధ్యాహ్నం నుంచి ఆకస్మికంగా కురిసిన వర్షానికి పలు ఈవెంట్స్ 1వ తేదీకి వాయిదా పడ్డాయి. విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, ప్రిన్సిపల్ ఇన్‌చార్జి మాల్యాద్రి, పీడీ ప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో జరిగాయి.



ఖోఖో ఆడుతున్న బాలికలు

అకాల వర్షంతో అన్నదాతల ఇబ్బందులు

అల్లూరు: మండలంలో బుధవారం మధ్యాహ్నం నుంచి అకాల వర్షంతో అన్నదాతలకు నష్టం వాటిల్లింది. ఒక్కసారిగా అకాల వర్షం విడతల విడతలుగా కురవడంతో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. తడుస్తున్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ధాన్యం రాసుల చుట్టూ వర్షం నీరు చేరడంతో నీటిని అంతా బయటకు ఎత్తి పారబోశారు. వర్షం లోనూ కొం మంది రైతులు లారీల్లో ధాన్యం బస్తాలను లోడ్ చేసి తరలించారు.



వర్షంలోనూ లారీలో లోడ్ చేస్తున్న ధాన్యం బస్తాలు

ఓటర్ల జాబితా పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్

ఆత్మకూరు: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలను పరిశీలిస్తున్నట్లు, మృతులు, డబుల్ ఎంట్రీలు ఉన్న ఓటర్లను తొలగిస్తున్నట్లు డిప్యూటీ కలెక్టర్ సుధాకర్ తెలిపారు. ఆత్మకూరులో బుధవారం ఆయన తహసీల్దారు లక్ష్మీనరసింహం, బీఎల్‌ఓలతో కలిసి జేఆర్‌పేట, ఎల్ఆర్‌పల్లి ప్రాంతాల్లో ఇళ్లకు వెళ్లి ఓటర్ల జాబితాను సరి చేసుకోవడంతో పాటు మృతుల వివరాలను వారికి తెలిపి ఆ ఇళ్ల వారి సంతకం తీసుకుని జాబితాల నుంచి తొలగిస్తున్నట్లు సమాచారం తెలియజేస్తున్నామన్నారు. బీఎల్‌ఓలు ఓటర్ల జాబితా పరిశీలన బాధ్యతగా నిర్వహించాలని డిప్యూటీ కలెక్టర్ సుధాకర్ అన్నారు. ఆత్మకూరులో 6,385 ఓటర్ల తొలగింపులు ఉన్నాయని, వాటిని చట్టప్రకారమే తొలగించామన్నారు.



జేఆర్‌పేటలో ఓ ఇంట్లో ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్

మండల అభివృద్ధికి జెడ్పీ నిధుల కేటాయింపు

చేజర్ల: మండలంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి సూచనల మేరకు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ నిధులు కేటాయించారని జెడ్పీటీసీ సభ్యుడు పీర్ల పార్థసారథి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.18.20 లక్షలు కేటాయించారన్నారు.

వివాహ వేడుకల్లో ఎంపీపీ



వధువును ఆశీర్వదిస్తున్న ఎంపీపీ

చేజర్ల: చేజర్ల, కాకివాయి గ్రామాల్లో బుధవారం జరిగిన వేర్వేరు పెళ్లి వేడుకల్లో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. చేజర్లకు చెందిన విద్యుత్‌శాఖ లైన్‌మెన్ అల్లం శేషాద్రి కుమార్తె శాంతిప్రియను ఆశీర్వదించారు. అలాగే కాకివాయికి చెందిన వి.వెంకటేశ్వర్లు కుమారుడు వెంకట్‌దిలీప్‌ను ఆశీర్వదించారు.